# ములుగు విద్యాశాఖ అధికారులపై ఆరోపణలు నిజమే..

**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ**

ములుగు, సెప్టెంబర్18 (నమస్తే తెలంగాణ) : జిల్లా విద్యాశాఖ అధికారులపై తాము చేస్తున్న ఆరోపణలు నిజమేనని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర నాయకుడు చాప బాబు, జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, హట్కర్ సమ్మయ్య, గన్‌రెడ్డి ఆదిరెడ్డి, రేగా నరేంద్రకుమార్, పొడేటి సమ్మయ్య, పల్లె నాగరాజు, జక్కుల వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈవో పాణిని, ఏసీజీఈ జయదేవ్ అవినీతి, అక్రమాలపై మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తే యూఎస్పీసీ గుర్తింపు లేని సంఘమనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సంఘం ద్వారా ఎన్నో ఏండ్లుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం స్పందిస్తూ రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. తాము లేవనెత్తిన అంశాలపై పరిష్కారం చూపలేక డీఈవో దాటవేత దోరణి సరైంది కాదన్నారు. ఓపెన్ టెన్త్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన రెమ్యునరేషన్‌ను సిబ్బందికి ఎందుకు చెల్లించలేదని డీఈవో సమక్షంలో ఏసీజీఈ జయదేవ్‌ను నిలదీశామన్నారు. డీసీఈబీలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న యాసం విక్రమ్‌రాజ్ అక్రమ బదిలీని కాపాడేందుకు ప్రస్తుతం రాఘవపట్నంలో పనిచేస్తున్న రవీందర్‌కు రూ.10వేలు లంచం ఎర చూపడంలో జయదేవ్ పాత్ర లేదా? అని ప్రశ్నించారు. దానిని అడ్డుకొని రవీందర్‌కు న్యాయం జరిగేలా కొట్లాడింది తమ సంఘమే అన్నారు. డీఎస్ఈ నుంచి వచ్చిన సీనియార్టీ లిస్ట్‌ను టాంపరింగ్ చేసి విక్రమ్‌రాజ్‌ను అక్రమంగా బదిలీ చేయించాలనే ప్రక్రియ జిల్లా విద్యాశాఖ అక్రమాలకు మచ్చుతునక అన్నారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో పక్షపాత వైఖరితో జూనియర్ అయిన రవళికకు ప్రమోషన్ ఇవ్వడం వల్ల ఇద్దరు సీనియర్ ఉపాధ్యాయినులు నష్టపోయారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. గతంలో యూఎస్పీసీతో జరిగిన చర్చలో డీఈవో ఇచ్చిన హామీకి కట్టుబడి జయదేవ్, యాసం విక్రమ్ రాజ్‌ను పాఠశాల విధులకు పంపి ఆయా స్థానాల్లో సీనియర్లను నియమించాలన్నారు. కాలపరిమితి ముగిసిన సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లను, జీసీడీవోలను తొలగించి నిబంధనల ప్రకారం సీనియర్‌తో, పరీక్షలు రాసిన వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తాము లేవనెత్తిన అంశాలు పరిష్కరించకపోతే భవిష్యత్తు కార్యాచరణ ఉధృతమవుతుందని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 : మండలకేంద్రంలోని వై జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రంజిత్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై తాజుద్దీన్ కథనం ప్రకారం.. ఆకులవారి ఘన్పూర్‌కు చెందిన చాంద్‌పాషా టాటా మ్యాజిక్‌తో వై జంక్షన్ వైపు వస్తున్నాడు. ఇదే క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న రంజిత్ వాహనాన్ని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రంజిత్ గాయపడి చేయి విరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు చాంద్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## గన్‌మెన్ కుటుంబానికి ఆర్థిక సాయం

మంగపేట, సెప్టెంబర్ 18 : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కొమరం జగన్ నర్సంపేటలో గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఆదివాసీ ఉద్యోగుల, సంక్షేమ, సాంస్కృతిక సంఘం బృందం పరామర్శించి రూ.13వేల ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింత కృష్ణమూర్తి, మద్దెల అంజయ్య పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి నిమజ్జనం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 18 : మండలంలో గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్, శివాపురం వీధిలోని విగ్రహాలను పాత్రాపురం జీపీలోని పాలెంవాగులో నిమజ్జనం చేశారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 : మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 8వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మడే నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13నుంచి 15వ తేదీ వరకు మౌలాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 7, 8వ తరగతులకు చెందిన ఎం రవి, ఎం ఉమేశ్, మాసయ్య, చింటు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. మాసయ్య, రవి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మహదేవపూర్, సెప్టెంబర్ 18 : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జీపీ కార్యదర్శి కల్పన ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 'స్వచ్ఛదనం-పచ్చదనం 'అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు జీపీ కార్యదర్శి తెలిపారు. హెచ్ఎంలు సరిత, బండం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు మడక మధు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కేంద్రంపై అవగాహన

గణపురం,సెప్టెంబర్ 18: మహిళా సాధికారత కేంద్రంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. బుధవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, మండల ఇన్‌చార్జి సాయిరాం, మహిళా సాధికారత ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ అనూష ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఎస్సై హాజరై మాట్లాడారు. బాల కార్మికులు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో పిల్లలు 1098, మహిళలు 181 టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ మమత, ఏపీఎం ఇమామ్, సీసీ బాబా విజయ, కళావతి, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

## సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజమౌళి

గణపురం, సెప్టెంబర్18 : సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బోనాల రాజమౌళి ఎన్నికయ్యారు. బుధవారం హనుమకొండ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజయ్య అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా కన్నెబోయిన కుమార్‌యాదవ్, రియాజ్, సురేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, సంయుక్త కార్యదర్శులుగా మమత, జ్యోతి, సరిత, కోశాధికారిగా సాంబరాజు, కార్యవర్గ సభ్యులుగా కోటి, శ్రీలత, రవీందర్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడు, డీవైఎస్‌వో ఇన్‌చార్జి చిర్ర రఘు, ఒలింపిక్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ యాదవ్, రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సారయ్య, హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్రీడాకారులకు జీఎం అభినందన

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 18 : భూపాలపల్లి ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం ఏరియాలో నిర్వహించిన క్రీడా పోటీలు నిర్వహించినట్లు భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి తెలిపారు. ఈ పోటీల్లో భూపాలపల్లి ఏరియాకు చెందిన వారు వెయిట్ లిఫ్టింగ్ పురుషుల 81 కేజీల విభాగంలో పుట్ట ప్రకాశ్ స్వర్ణం సాధించగా, 93 కేజీల విభాగంలో కే విజయ్ స్వర్ణం, 105 కేజీల విభాగంలో ఎస్ రాంకిశోర్ రజతం, 109+ కేజీల విభాగంలో బీ తిరుపతి రజతం, 120+ కేజీల విభాగంలో యాసిన్ మీర్జా బేగ్ స్వర్ణం సాధించిట్లు చెప్పారు. పవర్ లిఫ్టింగ్ 52 కేజీల మహిళల విభాగంలో బీ శ్రీలేఖ్య స్వర్ణం, 63 కేజీల విభాగంలో కే రేణుక స్వర్ణం,72 కేజీల విభాగంలో పీ శ్వేత రజతం, 90+ కేజీల బాడీ బిల్డింగ్‌లో ఎస్ శ్రీనివాస్‌రెడ్డి స్వర్ణం సాధించారన్నారు. వారిని ఏరియా జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ అభినందించారు. కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి విజయ పతాకాన్ని ఎగురవేయాలని కోరుతూ క్రీడాకారులందరికీ జీఎం శుభాకాంక్షలు తెలిపారు.

## లక్ష్మీరెడ్డిపల్లిలో మెగా మెడికల్ క్యాంప్

గణపురం, సెప్టెంబర్ 18 : లక్ష్మీరెడ్డిపల్లిలో బుధవారం కేకే ఎమ్మెస్ ప్రసాద్ దవాఖాన సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలందించడాన్ని అభినందించారు. జీపీ పరిధిలో ప్రజలకు వైద్య పరీక్షలు, 300 మందికి పైగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే అప్పయ్యపల్లి గ్రామంలో గణపురం పీహెచ్‌సీ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రచన, హెల్త్ అసిస్టెంట్ వేణు, తాజా మాజీ సర్పంచ్ ఒద్దుల విజయా అశోక్‌రెడ్డి, గ్రామస్తులు ఎక్కటి శ్యామలారెడ్డి, ఎడెల్లి మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మొలుగూరి రాజు, వీరమల్ల వీరారెడ్డి, మామిడాల విజయ్, శరత్, మేడిపల్లి సతీశ్‌గౌడ్, గొర్రె సరితా సుధాకర్‌రెడ్డి, పెంచాల నర్సయ్య, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాకారుడికి ఆర్థిక చేయూత

టేకుమట్ల, సెప్టెంబర్18 : జాతీయ స్థాయి త్రోబాల్ క్రీడకు ఎంపికైన అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాధ రఘును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, నాయకులు సన్మానించి ఆర్థిక సాయం చేశారు. మండలం నుంచి రాష్ట్ర స్థాయి త్రోబాల్‌లో ప్రతిభ కనబర్చి జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ క్రీడలో ఆయన పాల్గొననున్నారు. కార్యక్రమంలో మాదం కొమురయ్య, కొయ్యల చిరంజీవి, ఎలబోయిన రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ వెంటేశ్వర్‌రావు, సంగి రవి, కనుమరుగుల సంపత్, వంగ నరేశ్, బొల్లపెల్లి శ్రీను, రాజిరెడ్డి పాల్గొన్నారు.

## లైంగికదాడి నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

మంగపేట, సెప్టెంబర్ 18 : వెంకటాపూర్ మండలం, పెరుకపల్లికి చెందిన రజక మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల రజక సంఘం అధ్యక్షుడు నూతులకంటి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం రజకం సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదన్నారు. నిరసనలో మహిళా విభాగం అధ్యక్షురాలు పున్నం నాగలక్ష్మి, మంగపేట గ్రామ అధ్యక్షుడు తాటి రమణ, రాతిపెల్లి సాంబయ్య, లొంక వెంకటేశ్, చెలమయ్య, రాజు, నగేశ్, రాచకొండ గణేశ్, మహేశ్, భారతమ్మ, రాధిక, రమ పాల్గొన్నారు.

## 24న మండలస్థాయి క్రీడా ఎంపికలు

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 18 : మండల స్థాయిలో ఈ నెల 24న విద్యార్థులకు క్రీడా ఎంపికలు ఉన్నట్లు స్థానిక పాఠశాల హెచ్ఎం విజయపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం అదే పాఠశాలలో పీ డీ గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌జీఎఫ్ఐ పీడీల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 14 ఏండ్ల నుంచి 17 సంవత్సరాల బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగంలో ఎంపికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, అనిల్ కుమార్, పీడీలు సందీప్, శ్రావణి, అజయ్, శ్రీనివాస్, కార్తీక్ పాల్గొన్నారు.

## డీఏ, పెండింగ్ బిల్లులను చెల్లించాలి

చిట్యాల, సెప్టెంబర్ 18 : డీఏలను విడుదల చేసి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గోపాలపూర్ పాఠశాలలో తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరామిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే ఐదు డీఏలను విడుదల చేసి, పీఆర్సీని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మారబోయిన మహేందర్, మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి, జిల్లా నాయకులు ఏదుల మనోహర్, ప్రవీణ్ పాల్గొన్నారు.




















